సాక్షి
జనగామ

బుధవారం । 27 । ఆగస్టు । 2025



కేజీబీవీ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

కేజీబీవీ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య డిమాండ్ చేశారు. - 11లో



అనుమతిలేని ఔషధాల సీజ్

పాలకుర్తి మండలం వావిలాలలో అనుమతి లేకుండా నిల్వ చేసిన ఔషధాలను డ్రగ్స్ కంట్రోల్ అధికారులు సీజ్ చేశారు. - 11లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27° /23°

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బీసీ అభివృద్ధి అధికారిగా బాధ్యతలు



జనగామ: జిల్లా బీసీ అభివృద్ధి అధికారిగా ఎస్.లక్ష్మినర్సింహారావు మంగళవారం బాధ్యలను స్వీకరించారు. రంగారెడ్డి జిల్లాలో పని చేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం ఎఫ్ఏసీగా పని చేస్తున్న రవీందర్ నుంచి బాధ్యతలను తీసుకున్న తర్వాత కలెక్టర్ రిజ్వాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి



జనగామ రూరల్: న్యాయవాదుల భద్రత, రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఐలు (ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్) జిల్లా కన్వీనర్ గాజుల రవీందర్ అన్నారు. కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాది తన్నీరు శ్రీకాంత్‌పై దాడికి నిరసనగా మంగళవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులపై వరుస దాడులు జరుగుతుండటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు దాడులను అరికట్టడంలో విఫలమయ్యాయని విమర్శించారు. న్యాయవాదులకే రక్షణ లేకపోతే ప్రజలకు న్యాయం ఎలా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ మహేశ్వరం బద్రీనాథ్, వట్టేపు వినయ్ కుమార్, అమృత రావు, బిట్ల గణేష్, ఎ. లక్ష్మణ స్వామి, గుగులోత్ శ్రీనివాస్, మోతే సంపత్, బాలబోయిన సంపత్, చాగంటి శ్రీనివాస్, బస్కుల ఠాగూర్, కాముని శ్రావణ్ కుమార్, పోగుల కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



చిల్పూరు: జిల్లాలో యూరియా కొరత లేదని, అక్రమ నిల్వలు చేసి కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి అంబికసోని అన్నారు. మండలంలోని మంగళవారం మండల వ్యవసాయాధికారి నజీరుద్దీన్‌తో కలిసి పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ జిల్లాలో సరిపోను యూరియా నిల్వలు ఉన్నాయని, ఎక్కడైన యూరియా వచ్చిందనగానే రైతులు ఒక్కసారిగా ఎగబడటంతో దొరకడం లేదన్నారు. సొసైటీల వారీగా యూరియా వస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏఈఓలు వినయ్‌కుమార్, నర్సింహులు, యాకూబ్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి



జనగామ రూరల్: పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు తోట హృతిక్‌సాయి డిమాండ్ చేశారు. మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన కార్యక్రమంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు సర్టిఫికెట్ తీసుకోలేక, కొత్త అడ్మిషన్ పొందలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. భవనాలకు అద్దె చెల్లించకపోవడంతో యజమానులు తాళాలు వేసే పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి దేశగాని సాయి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివార్ల మహేందర్, వట్టిపల్లి గణేష్, దేవులపల్లి నితీష్, సాగర్, అక్షిత్ పాల్గొన్నారు.

రేపు ఉచిత ఉపకరణాల శిబిరం

జనగామ రూరల్: జిల్లాలో దివ్యాంగులకు రేపు (గురువారం) అలింకో సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉపకరణాల క్యాంపు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలలోపు ఉన్న విద్యార్థులు ఈ నెల 28న ప్రెస్టేజ్ హైస్కూల్‌లో ఉదయం 10 నుంచి ఐదు గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. ఆధార్, రేషన్, సదరం సర్టిఫికెట్ జిరాక్స్‌తో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు కోఆర్డినేటర్ నాగరాజు (9491533047)ను సంప్రదించాలన్నారు.

సందడి షురూ

- జిల్లాలో పండుగ హోరు
- మార్కెట్‌లో రద్దీ, లడ్డూలకు గిరాకీ
- మండపాలు సిద్ధం చేసిన నిర్వాహకులు

నేడు వినాయక చవితి



వినాయక ప్రతిమను తీసుకువెళ్తున్న మహిళ

నవరాత్రి ఉత్సవాలకు వినాయకుడిని తీసుకువెళ్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు





రఘునాథపల్లి: బ్యాంక్ స్ట్రీట్‌లో భారీ వినాయక మండపం



జనగామ: జనగామలో వినాయక చవితి పండుగ సందడి మొదలైయింది. ఆధ్యాత్మికత, భక్తి, ఉత్సాహం, వ్యాపారం అన్నీ కలిసిపోయి గ్రామాలన్నీ పండుగ వాతావరణంలో మునిగిపోయింది. ప్రకృతిని ఆరాధించడం, పంచభూతాలను పూజించడం భారతీయ సంస్కృతి గొప్పతనం. వినాయక చవితి పండుగను పురస్కరించకుని గణపయ్యను 21 రకాల పత్రులతో పూజించడంలో శాస్త్రీయమైన భావన ఉంది. ఈ పత్రాలు నీటిలో కలిసినప్పుడు ఔషధ గుణాలు వ్యాపించి వాగులు, చెరువులను శుభ్రం చేస్తాయని విశ్వాసం. పత్రి పూజ ద్వారా ప్రకృతిని కాపాడుకోవాలని పండుగ మనకందించే సందేశం. నేడు (బుధవారం) వినాయక చవితి పండుగ నేపథ్యంలో సాక్షి ప్రత్యేక కథనం.

మండపాలకు విగ్రహాల తరలింపు..

పట్టణంలోని పలు ప్రాంతాల్లో వ్యాపారులు తయారీ చేసిన వినాయకుడి ప్రతిమల విక్రయాలు జోరందుకున్నాయి. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రతిమలను కొనుగోలు చేసి ఆటోలు, ట్రాక్టర్లు, డీసీఎం, ఇతర వాహనాల్లో మండపాలకు తరలిస్తున్నారు. అలాగే పూలదండలు, పండ్లు, పత్రులు, పూజా సామగ్రి కోసం కొనుగోలుదారులు బారులుదీరారు. గ్రామాల నుంచి ప్రత్యేకంగా మామిడి కొమ్మలు, సీతాఫల్, జామ, దానిమ్మ, పత్రులు, పండ్లు పెద్ద ఎత్తున మార్కెట్‌కు చేరాయి.



పట్టణంలో పత్రుల అమ్మకాలు

మార్కెట్‌లో రద్దీ నెలకొంది.

కిక్కిరిసిన బస్టాండ్

పండుగ రాకతో జనగామ ఆర్టీసీ బస్టాండ్ జనసందోహంతో నిండిపోయింది. ఉద్యోగాలు, చదువుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లిన వారు స్వగ్రామాలకు చేరుకోవడంతో బస్టాండు కిక్కిరిసిపోయింది.

భద్రతా ఏర్పాట్లు

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా సాగేందుకు పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. డీసీపీ రాజమహేంద్రనాయక్ నేతృత్వంలో ఏసీపీ, సీఐ, ఎస్సైల ఆధ్వర్యంలో పర్యవేక్షణ చేస్తున్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, భద్రతా సిబ్బందిని మొహరించారు. ఆధ్యాత్మికత, భక్తి ఆరాధనతో నిండిన వినాయక చవితి వేడుకలు జిల్లాలో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చాయి. కాగా వారం రోజులపాటు కనుమరుగైన వరణుడు ముసురు రూపంలో ప్రత్యక్షం కావడంతో చిరు వ్యాపారులు ముసురులోనే అమ్మకాలు జరిపారు.

6న నిమజ్జనం

జిల్లాలో వచ్చే నెల (సెప్టెంబర్) 6వ తేదీన వినాయక నిమజ్జనం జరుపుకోవాలని జిల్లా గణేష్ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు మంచాల రవీందర్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాణాపురం వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు, సిద్ధాంతి కృష్ణ మాచార్యులు ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ నాయకులు రంగ నర్సింగ రావు, కీర్తి నరసయ్య తదితరులు ఉన్నారు.

లడ్డూలకు గిరాకీ

వినాయకుడి చేతిలో లడ్డూ పెట్టడం సంప్రదాయం. ఈసారి కూడా అర కిలో లడ్డూ నుంచి 25 కిలోల బరువు ఉన్న లడ్డూల వరకు తయారు చేయడానికి స్వీట్ హౌస్‌ల్లో ఆర్డర్లు ఇచ్చారు. పట్టణంలో రాత్రి సమయంలో గణేష్ మండపాలు విద్యుత్ వెలుగుల అలంకరణలతో మెరిసిపోతున్నాయి.

మహాగణపతి.. గోమయ గణపతి - 10లో

విద్యావ్యవస్థను మరింత పటిష్టపరచాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: విద్యావ్యవస్థను మరింత పటిష్టం చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశహాల్‌లో విద్యావ్యవస్థ పటిష్టతపై అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి అన్ని రంగాల్లో రాణించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. అంతకుముందు ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన హెచ్‌ఎంలకు ప్రశంసపత్రాలు అందించి అభినందించారు. సమావేశంలో విద్యాశాఖ అధికారులు చంద్రభాను, రవికుమార్, సత్యమూర్తి, శ్రీనివాస్, గౌసియా బేగం, రామరాజు, నాగరాజు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే విద్యార్థి ఆరోగ్య ప్రొఫైల్ కార్డు వాల్ పోస్టర్లను అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డీఎంహెచ్‌ఓ మల్లికార్జునరావుతో కలిసి విడుదల చేశారు. ప్రతీ విద్యార్థి ఆరోగ్యానికి సంబంధించిన ప్రాథమిక సమాచారం నమోదుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

పోస్టు మాస్టర్లకు పింఛన్ కిట్ల పంపిణీ

జనగామ: జిల్లాలో ఆసరా పింఛన్ల పంపిణీ ప్రక్రియను మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు బ్రాంచ్ పోస్టు మాస్టర్లకు కొత్త మొబైల్ ఫోన్లు, ఫింగర్ ప్రింట్ డివైజ్‌లతో పాటు సాంకేతిక పరికరాలకు సంబంధించి కిట్లను అందించినట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా 167 కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ పీడీ వసంత, ఏపీడీ నూరోద్దీన్, డీపీఎం సతీష్, గిరిబాబు, పోస్టల్ శాఖ ఏఎస్‌పీ కృష్ణ, నవీన్, భాస్కర్, పోస్ట్ మాస్టర్లు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



కేజీబీవీలో పప్పు దినుసులను పరిశీలిస్తున్న కలెక్టర్

తరిగొప్పుల: మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం మండలంలో ఆకస్మిక పర్యటన చేసి కేజీబీవీ, ఇందిరమ్మ ఇళ్లు, ఫర్టిలైజర్ షాపులను పరిశీలించారు. కేజీబీవీలో మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని ఎస్‌ఓ సునీతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూరగాయలు, పప్పు ధాన్యాలు పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇసుక, కంకర, ఇతర సామగ్రి నిర్ణీత ధరలో లబ్ధిదారులకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పలు ఫర్టిలైజర్ షాపులోని స్టాక్ రిజిస్టర్‌లు పరిశీలించి యూరియా కొరత సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మొగుళ్ల మహిపాల్‌రెడ్డి, ఎంపీడీఓ ఆలేటి దేవేందర్‌రెడ్డి, ఏఓ మనోహిత్ విక్రమరావు, ఎంపీఓ మాలతి, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే రక్ష..

భక్తితో పూజిద్దాం.. భద్రతతో నిఘా ఉంచుదాం..

- మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలకు చెక్
- నిర్వాహకులు, ఎలక్ట్రీషియన్లకు విద్యుత్ శాఖ సూచనలు

జనగామ: జిల్లాలో నేటి (బుధవారం) నుంచి ప్రారంభమయ్యే గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఎన్పీడీసీఎల్) సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా సర్కిల్ ఎస్ఈ టి.వేణుమాధవ్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు సంబంధించి డీఈ, ఏడీఈ, ఏఈలకు ప్రత్యేక సూచనలు జారీ చేశారు. గణేష్ మండపాల నిర్వాహకులు, ఎలక్ట్రీషియన్లు, విద్యుత్ శాఖ సిబ్బంది పాటించాల్సిన మార్గదర్శకాలను విడుదల చేశారు.

మండప నిర్వాహకులకు సూచనలు

గణేష్ మండపాలను విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో ఏర్పాటు చేయరాదు. నాణ్యతతో కూడిన ఈఎల్‌సీబీ, ఎంసీబీలను మాత్రమే అమర్చుకోవాలి. లైసెన్స్ కలిగిన ఎలక్ట్రీషియన్‌తోనే వైరింగ్ చేయించుకోవాలి. తీగలకు హుక్కింగ్ అస్సలు వేయరాదు. వైరింగ్‌లో జాయింట్లు లేకుండా చూసుకునే బాధ్యత నిర్వాహకులతో పాటు ఎలక్రిషన్లపై ఉంటుంది. మండపాలకు ఇనుప పైపులు ఉపయోగించినట్లయితే, వాటిని ఇన్సులేషన్‌తో కవర్ చేయాలి. నిర్వాహకులు, పూజలు చేసే సమయంలో భక్తులు తడి చేతులతో స్విచ్ బోర్డులు తాకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మండపాలకు వచ్చే పిల్లల భద్రతకు స్విచ్ బోర్డులను ఎత్తైన ప్రదేశంలో బిగించాలి. అత్యవసర సమయాల్లో సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1912, ఏఈ, జేఎల్ఎం నంబర్లను అందులో కనిపించే విధంగా ముద్రించాలి.

విద్యుత్ శాఖ సిబ్బందికి..

విద్యుత్ తీగలు, ట్రాన్స్ ఫార్మర్ల సమీపంలో మండపాలు ఏర్పాటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలి. గణేష్ విగ్రహాల ఎత్తులను రికార్డు చేసి, ఊరేగింపు మార్గాల్లో సరైన లైన్ క్లియరెన్స్ ఉందో లేదో ముందుగానే నిర్ధారించుకోవాలి. అన్ని ఎల్‌టీ, 11కేవీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తనిఖీ చేసి లోపాలను సరిచేయాలి. రద్దీ ప్రాంతాల్లో ఎల్‌టీ లైన్లకు స్పేసర్‌లను అమర్చాలి. నిమజ్జన ఊరేగింపు మార్గంలో విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది నిఘా ఉంచాలి. నిర్వాహకులతో భద్రతా సమావేశాలు నిర్వహించాలి.

మండపాలకు ఉచిత విద్యుత్

గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నేటి నుంచి ప్రారంభమయ్యే మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరాను అందించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎన్పీడీసీఎల్ ఎస్ఈ టి.వేణుమాధవ్ మంగళవారం ప్రకటన వెలువరించారు. గత సంవత్సరం యాప్ ద్వారా సేకరించిన డేటా ఆధారంగా మండపాలకు ఇచ్చే స్లాట్‌లను గుర్తించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుత సంవత్సరానికి సంబంధించి గణేష్ మండపాల వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు పూర్తి స్థాయి నివేదికను ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు.



అప్రమత్తంగా ఉండాలి



గణేష్ మండపాలతో పాటు నిమజ్జన ఊరేగింపుల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి. నిర్వాహకులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే ఉత్సవాలను విజయవంతంగా జరుపుకోవచ్చు. గైడ్‌లైన్స్‌ను అనుసరించి డీఈ, ఏడీఈ, ఏఈల ఆధ్వర్యంలో సిబ్బంది మండపాల తనిఖీలు, ఫ్లెక్సీల ఏర్పాటు, అవగాహన తదితర వాటిపై దృష్టి సారించాలి.

- టి.వేణుమాధవ్, ఎస్ఈ

పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే పూజిద్దాం

- అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

జనగామ రూరల్: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే పూజించాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని నెహ్రూ చౌక్ వద్ద మున్సిపాలిటీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రసాయనాలతో తయారు చేసిన ప్రతిమలతో నీటి కాలుష్యం పెరిగిపోతుందన్నారు. మట్టి ప్రతిమలను పూజించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. అలాగే ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ ఆర్మీ వింగ్ 10 బెటాలియన్ కెడెట్స్ ఆధ్వర్యంలో మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఆర్యభట్టా పాఠశాలలో కరస్పాండెంట్ సురేష్ చంద్ర, ప్రిన్సిపాల్ సృజన ఆధ్వర్యంలో మట్టి వినాయకులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి



శానిటేషన్ నిర్వహణను పరిశీలిస్తున్న కమిషనర్

జనగామ: పట్టణంలో పేరుకుపోయిన ప్రజా సమస్యలు, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డులతో పాటు హైదరాబాద్, సిద్దిపేట, సూర్యాపేట రహదారులను పరిశీలించారు. 17వ వార్డులోని మోడల్ మార్కెట్, 15 వార్డులో స్లాటర్ హౌస్, 15, 17, 20, 21, 27, 29, 30 వార్డుల్లో నెలకొన్న సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపయ్య, పులిశేఖర్, జవాన్లు లక్ష్మణ్, ఎల్లేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు

- ఎస్జీటీల పోస్టుల నుంచి 87 మంది ఖాళీ
- సుమారు 50 పాఠశాలల్లో ఒకేఒక్కరు
- పీఎస్ పరిధిలో ఉపాధ్యాయుల కొరత

జనగామ: జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ముగిసింది. విద్యారంగంలో కొత్త మార్పులు చోటు చేసుకున్నాయి. 87 మంది ఎస్జీటీలు (సెకండరీ గ్రేడ్ టీచర్లు) వివిధ విభాగా ల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందారు. దీంతో హై స్కూల్స్‌లో సబ్జెక్ట్ నిపుణుల కొరత తీరనుండగా.. ప్రాథమిక పాఠశాల పిల్లలకు బోధన పరంగా కష్టాలు ప్రారంభం కానున్నాయి.

సబ్జెక్టుల వారీగా ప్రమోషన్లు

జిల్లాలో సబ్జెక్టుల వారీగా ఎస్జీటీలుగా పదోన్నతులు పొందారు. ఇందులో పీఎస్ హెచ్‌ఎం–22, స్కూల్ అసిస్టెంట్ బయాలజీ–15, సోషల్ స్టడీస్–24 గణితం–6, ఫిజిక్స్–5, ఇంగ్లిష్–9, తెలుగు–1, హిందీ–2, ఫిజికల్ డైరెక్టర్ –1, స్పెషల్ ఎడ్యుకేషన్–3 ఉన్నారు. ఈ పదోన్నతుల హైస్కూల్ స్థాయిలో ఉపాధ్యాయుల కొరత తీరనుండగా, ప్రాథమిక పాఠశాలల్లో మాత్రం సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

ప్రాథమిక పాఠశాలల్లో కొత్త సవాళ్లు

'బడి బాట' ద్వారా ఈ ఏడాది ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఇందులో ప్రాథమిక పాఠశాలల్లోనే అత్యధికంగా అడ్మిషన్లు వచ్చాయి. ఇద్దరు టీచర్లు మాత్రమే ఉన్న పీఎస్‌ల పరిధిలో ఒకరికి ప్రమోషన్ రావడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. జిల్లాలోని సుమారు 50 ప్రాథమిక పాఠశాలల్లో ఒకరు పదోన్నతిపై హైస్కూల్ స్థాయికి వెళుతున్నారు. దీంతో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఏర్పడుతుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఖాళీల భర్తీకి తక్షణమే విద్యావలంటీర్లను నియమించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు అదనపు కలెక్టర్, డీఈఓ పింకేష్‌కుమార్ చేతులమీదుగా ఆర్డర్ కాపీలను అందించగా, వారు విధుల్లో చేరి బాధ్యతలను తీసుకున్నారు.

తప్పని నిరీక్షణ

జిల్లాలో పెద్దగా యూరియా కొరత లేకున్నా.. పలు మండలాల పరిధిలో నిరీక్షణ తప్పడం లేదు. మంగళవారం కొడకండ్ల, నర్మెట, పాలకుర్తి, దేవరుప్పుల, స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి మండలాల్లో ఆగ్రోస్, పీఏసీఎస్, ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాల వద్ద రైతులు తెల్లవారు జాము నుంచే యూరియా కోసం బారులుదీరారు.

- జనగామ/సాక్షి నెట్‌వర్క్



రఘునాథపల్లి: ఫర్టిలైజర్ దుకాణం ఎదుట క్యూలో ఉన్న రైతులు

సాగునీటికి మొదటి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

లింగాలఘణపురం: సాగునీటి పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పనుల జాతరలో భాగంగా రూ.2.30కోట్ల సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నెల్లుట్లలో విలేకరులతో మాట్లాడారు. ఆర్ఎస్ ఘన్‌పూర్ నుంచి నవాబుపేట రిజర్వాయర్‌కు వచ్చే ప్రధాన కాల్వకు రూ.150 కోట్ల లైనింగ్ పనులను మంజూరు చేయించానన్నారు. రిజర్వాయర్ పనులన్నీ ఏడాదిలో పూర్తి చేయించి నియోజకవర్గంలోని ప్రతీ చెరువును గోదావరి జలాలతో నింపి సస్యశ్యామలం చేస్తామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతోనే జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాలకు సాగునీరు అందలేదన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ వసంత, ఆర్డీఓ గోపీరామ్, డీఈ ఆర్.రవీందర్, ఎంపీడీఓ రఘురామకృష్ణ, తహసీల్దార్ రవీందర్, ఏఈ శ్రీనివాసు, శివకుమార్, గుడి వంశీధర్‌రెడ్డి, మోహన్, శ్రీలతారెడ్డి, బాబు, దిలీప్‌రెడ్డి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

మహాగణపతి.. గోమయ గణపతి

మట్టి, గోమయ విగ్రహాలకే జై కొడుతున్న భక్తులు..

- ఏళ్లుగా నవరాత్రి ఉత్సవాల నిర్వహణ
- పర్యావరణానికి హాని కలగని విధంగా పూజలు

మట్టి విగ్రహాలను పూజిద్దాం.. భావితరాలకు కాలుష్య రహిత సమాజాన్ని అందిద్దాం అనే గొప్ప సంకల్పంతో కొందరు భక్తులు ఏళ్లుగా మట్టి, గోమయ, పేపర్ వినాయక విగ్రహాలకే జై కొడుతున్నారు. మండపాల్లో ఆ విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణానికి హాని కలగని విధంగా పూజలు, అభిషేకాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆ విధంగా పూజలు నిర్వహిస్తున్న భక్తులు, పలు మండపాల నిర్వాహకులు, సేవా ట్రస్ట్‌లపై 'సాక్షి' ప్రత్యేక కథనం.


వెల్దండలో ప్రతిష్ఠించిన మట్టి గణపతి(ఫైల్)

రసాయనాలు వద్దు.. మట్టి గణపతే ముద్దు

నర్మెట: 'రసాయనాలు వద్దు.. మట్టి గణపతులే ముద్దు' అనే నినాదంతో వెల్దండ రాక్ స్టార్ ఫ్రెండ్స్ యూత్ తొమ్మిది ఏళ్లుగా గ్రామంలో మట్టి వినాయకులను ప్రతిష్ఠించి ఘనంగా నవరాత్రులను నిర్వహిస్తున్నారు. కలకత్తా కళాకారులు రూపొందించిన గణపతులను వరంగల్ నుంచి కొనుగోలు చేస్తున్న ట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించడమే తమ బాధ్యతని యూత్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు మోహన్ బాషా, బొ లగం అవినాష్‌లు తెలిపారు. ఈ సంవత్సరం కూడా మట్టి గణపతిని ప్రతిష్ఠించనున్నట్లు వారు తెలి పారు. ప్రతీఒక్కరు మట్టి వినాయకులను ప్రతిష్ఠించి ముందు తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలని కోరారు.

గణనాథుని పూజించండి... సిరిసంపదలతో తులతూగండి

- Advt Feature


మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం..

వినాయకుడు




వినాయకుడంటే భౌతికంగా మనకు కనిపించే ఆకారం మాత్రమే కాదు.. ఆయన రూపు, స్వభావం వెనుక లోతైన అర్థం ఉందని వేదాంతులు చెబుతుంటారు. గణేశుని ఆరాధనతో బాధల నుంచి సులభంగా విముక్తి పొంద వచ్చని సూచిస్తుంటారు. అందుకే గణేశుడే ప్రముఖంగా ఆరాధించబడే గాణపత్యం అనే శాఖ కూడా ఉంది. వినాయకుని ఆరాధనలో ఆధ్యాత్మిక రహస్యాలు ఎన్నో ఉన్నాయని చెప్పేందుకు ఓ గొప్ప ఉదాహరణ ఆయన అవతారాలు. ముద్గల పురాణం ప్రకారం వినాయకుడు ఎనిమిది అవతారాలను ధరించాడు. ఆ ఎనిమిది అవతారాల వివరాలను, గణనాథుని మహిమలను తెలుసుకుని ఆ వినాయకుని సేవించి తరిద్దాం.

వక్రతుండుడు




పూర్వం ఇంద్రుడు చేసిన ఒక పొరపాటు వల్ల 'మాత్సర్యాసురుడు' అనే రాక్షసుడు ఉద్భవించాడు. అతని ధాటికి ముల్లోకాలూ అల్లాడిపోయి దేవతలంతా దత్తాత్రేయుని శరణు వేడారు. అంతట దత్తాత్రేయుడు, గణపతిని ప్రార్థించమని సూచించాడు. 'గం' అనే బీజాక్షరంతో దేవతలంతా ఆ గణపతిని గురించి తపస్సు చేయగానే 'వక్రతుండుని'గా అవతరించాడు. ఆయన సింహవాహనుడై ఆ మాత్సర్యాసురుని జయించాడు. వక్రతుండం అనేది ఓంకారానికి ప్రతీకగా, మాత్సర్యాసురుడు మనలోని మత్సరానికి (ఈర్ష్య) ప్రతీకగా చెప్పుకోవచ్చు. ఈ లోకం నాది, ఈ లోకంలో అందరికంటే నాదే పైచేయి కావాలి అనుకున్న రోజున ఈర్ష్యాసూయలు జనిస్తాయి. ఈ జగత్తు ఒక నాటకం మాత్రమే అని గ్రహించిన రోజున మనసులో ఎలాంటి ఈర్ష్య ఉండదు.

ఏకదంతుడు




చ్యవనుడనే రుషి మదాసురుడనే రాక్షసుని సృష్టించాడు. రాక్షసుల గురువైన శుక్రాచార్యుడు అతనికి 'హ్రీం' అనే మంత్రాన్ని ఉపదేశించి నిరంతరం జపిస్తే ఫలితం దక్కుతుందన్నాడు. లోకాధిపత్యమే అభీష్టంగా గల మదాసురుడు ఆ హ్రీంకారాన్ని యుగాల తరబడి జపించాడు. దాంతో అతనికి కోరుకున్న శక్తులన్నీ లభించి మదాసురునికి తిరుగులేకుండాపోయింది. అతని చేష్టలకు దేవతలంతా భీతిల్లిపోయి సనత్కుమారుని చెంతకు ఉపాయం కోసం పరుగులు తీశారు. సనత్కుమారుని సూచన మేరకు వారంతా గణేశుని కోసం ప్రార్థించగా, ఆయన 'ఏకదంతు'నిగా అవతరించి మదాసురిని జయించాడు. ఇక్కడ మదాసురుడు అంటే మదానికి (గర్వం) చిహ్నం, ఏకదంతుడు ఈ సృష్టి యావత్తూ ఒకటే అన్న అద్వైతానికి చిహ్నం.

మహోదరుడు




శివుడు ఓసారి తీవ్రమైన తపస్సులో మునిగిపోయాడు. ఎంత కాలమైనా ఆయన ఆ తపస్సుని వీడకపోవడంతో పార్వతి కంగారు పడి పరమేశ్వరుని తపస్సు నుంచి బయటకు తీసుకురావాలని గిరిజన యువతిగా మారి ఆయన తపోభంగం కలిగించే ప్రయత్నం చేసింది. పార్వతి చేష్టలకు పరమేశ్వరునికి దిగ్గున మెలకువ వచ్చి ఏం జరిగింది అన్న అయోమయం కూడా ఏర్పడి ఓ రాక్షసుడు జనించాడు. అతనే మోహాసురుడు. ఆ మోహాసురుడు సూర్యుని ఆరాధించి ముల్లోకాధిపత్యాన్ని సాధించాడు. దేవతల ప్రార్థనను మన్నించి గణేశుడు లంబోదరునిగా అవతరించాడు. మోహం ఎప్పుడూ అయోమయానికి దారితీస్తుంది. దృక్పథం సంకుచితంగా మారిపోతుంది. అందరూ నావారే అన్న విశాలమైన దృష్టి కలిగిన రోజున ఆ మోహం దూరమైపోతుంది.

గజాననుడు



కుబేరుని ఆశ నుంచి లోభాసురుడు అనే రాక్షసుడు జనించాడు. శివపంచాక్షరిని జపించిన ఆ లోభాసురుడు, శివుని అనుగ్రహంతో ముల్లోకాలనూ జయించే వరాన్ని పొందాడు. కానీ అతని లోభానికి అంతులేకుండా పోయింది. చివరికి శివుని కైలాసాన్ని కూడా తన స్వాధీనంలోకి తెచ్చుకోవాలనుకున్నాడు. ఆ విషయాన్ని తెలుసుకున్న దేవతలు రైభ్యుడనే రుషిని శరణువేడారు. గణపతిని కనుక ఆవాహన చేస్తే, లోభాసురుని పరాజయం ఖాయమని సూచించాడు. అలా సకల దేవతల ప్రార్థనలను మన్నించి గణేశుడు 'గజాననుడి'గా అవతరించి లోభాసురుని జయించాడు. గజాననుడు అంటే ఏనుగు ముఖం కలిగినవాడు అని అర్థం. ఏనుగు తల బుద్ధిని సూచిస్తుంది. ఆ బుద్ధిని కనుక ఉపయోగిస్తే మనలోని లోభం (అత్యాశ, పిసినారితనం) దూరం కాకతప్పదు.

లంబోదరుడు



దేవ, రాక్షసులు కలిసి సాగరాన్ని మథించినప్పుడు చివరగా అమృతం దక్కిన విషయం తెలిసిందే! ఈ అమృతాన్ని రాక్షసులకు కాకుండా చేసేందుకు విష్ణుమూర్తి మోహినీ అవతారాన్ని ధరించాడు. మోహిని రూపంలో ఉన్న విష్ణుమూర్తిని చూసిన శివునికి కూడా మనసు చలించగా విష్ణువు తన నిజరూపంలోకి రావడంతో శివుడు భంగపడి క్రోధితుడయి క్రోధాసురుడు అనే రాక్షసుడు జనించాడు. సూర్యదేవుని ఆశీస్సులతో మహాబలవంతుడయ్యాడు. క్రోధాసురుడు ప్రీతి అనే కన్యను వివాహమాడగా హర్షం, శోకం అనే సంతానం కలిగారు. వినాయకుడు లంబోదరుని రూపంలో క్రోధాసురుడిని అణచివేశాడు. క్రోధం ఎప్పుడూ తాను ఇష్టపడిన దాని కోసం వెంపర్లాడుతుంది. ఆ వెంపర్లాటలో గెలిస్తే హర్షం, ఓడితే శోకం అనే ఉద్వేగాలు కలుగుతాయి.

వికటుడు




పూర్వం కామాసురుడనే రాక్షసుడు ఉండేవాడట. ఆ కామాసురుడు శివుని గురించి ఘోర తపస్సు చేసి ముల్లోకాధిపత్యాన్ని సాధించాడు. అతని బారి నుంచి కాపాడే ఉపాయం సెలవిమ్మంటూ దేవతలంతా ముద్గల మహర్షిని వేడుకున్నారు. అంతట ఆ రుషి తదేక దీక్షతో ఓంకారాన్ని జపిస్తూ ఉంటే కనుక ఆ గణేశుడు ప్రత్యక్షమై వారి కష్టాన్ని తీరుస్తాడని సెలవిచ్చాడు. ముద్గలుని ఉపాయం పాటించిన దేవతలకు గణేశుడు వికటునిగా ప్రత్యక్షం అయ్యాడు. గణేశుని రూపు కాస్త విభిన్నంగా ఉంటుంది. అది ఒకోసారి ఓంకారాన్ని కూడా తలపిస్తుందని చెబుతారు. ఆ ఓంకార స్వరూపంతో కామాన్ని ఎదుర్కోవచ్చుననీ వికటుని వృత్తాంతం తెలియచేస్తోంది.

విఘ్నరాజు



కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలకు ప్రతీకగా ఇప్పటివరకూ రాక్షసులని చూశాము. ఇక మమతాసురుడు అనే రాక్షసుని కథ ఇది. శంబరుడు అనే రాక్షసుని ప్రలోభంతో మమతాసురుడు ముల్లోకాలనూ పీడించసాగాడు. దేవతల కోరిక మేరకు వినాయకుడు, విఘ్నరాజుగా అవతరించి మమతాసురుని సంహరించాడు. చిత్రంగా ఈ అవతారంలో వినాయకుడు నాగుపామును వాహనంగా చేసుకున్నట్లు చెబుతారు. ఇక్కడ మమత అంటే దేహాభిమానానికి ప్రతీక. ఆ దేహంలోని కుండలిని జాగృతం చేసిన రోజున మోక్షానికి గల విఘ్నాలన్నీ తొలగిపోతాయి. దేహాభిమానానికి మమతాసురుడు, కుండలినికి సూచనగా నాగ వాహనం కనిపిస్తాయి.

ధూమ్రవర్ణుడు



అరిషడ్వర్గాలు అయిపోయాయి, దేహాభిమానమూ తీరిపోయింది. ఇక 'నేను' అనే అహంకారం ఒక్కటే మిగిలింది. దానికి సూచనే అహంకారాసురుడనే రాక్షసుడు. ధూమ్రము అంటే పొగ అన్న అర్థం కూడా వస్తుంది. ధూమ్రానికి ఒక ఆకారం అంటూ ఉండదు. ఒక పరిమితీ ఉండదు. సర్వవ్యాపి అయిన ఆ భగవంతుని ప్రతిరూపం ధూమ్రం. మనిషి 'తాను' అనే అహంకారాన్ని వీడి ఆ భగవంతునిలో ఐక్యం కావడానికి సూచనే ఈ అహంకారాసురుని వృత్తాంతం. 'నేను' అనే అహంకారాన్ని పక్కనపెట్టి తనను తాను తెలుసుకునే ప్రయత్నం చేస్తూ పరులకు ఉపకారం చేస్తూ దైవ చింతనతో దైవాన్ని వెతుకుతూ మోక్షంకోసం సాధన చేయడమే దీని సారాంశం.